సాక్షి
వైఎస్ఆర్ జిల్లా

గురువారం । 6 । మార్చి । 2025

10న ఐటీఐలో అప్రెంటిస్ మేళా

కడప కాగితాలపెంటలోని గవర్నమెంట్ డీఎల్ టీసీ ఐటీఐలో ఈనెల 10వ తేదీ ఉదయం 10 గంటలకు అప్రెంటిస్ మేళా నిర్వహించనున్నట్లు ఏడీ రత్నరాజు తెలిపారు. అర్హత గల ఐటీఐ అభ్యర్థులు తమ పదో తరగతి, ఐటీఐ మార్కుల జాబితా, ఎన్‌టీసీ సర్టిఫికెట్‌తోపాటు ఆధార్, కులధ్రువీకరణ పత్రాలతో టీఎల్‌టీసీ ఐటీఐ కార్యాలయానికి హాజరుకావాలని తెలిపారు.

-కడప ఎడ్యుకేషన్

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ గురు॥ (సా॥)	సహర్ శుక్ర॥ (ఉ॥)
కడప	: 6.29	5.12
పులివెందుల	: 6.31	5.19
ప్రొద్దుటూరు	: 6.30	5.16

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం 38.5 /21.5

జిల్లాలో బుధవారం 21.5 – 38.5 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 1.7 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

– కడప అగ్రికల్చర్.

న్యూస్‌రీల్

సచివాలయ ఉద్యోగి సస్పెన్షన్

బద్వేలు అర్బన్ : మున్సిపాలిటీ పరిధిలోని రామాంజనేయనగర్ సచివాలయం వార్డు పరిపాలన కార్యదర్శి కోనగిరిబాబును సస్పెండ్ చేస్తూ బుధవారం మున్సిపల్ కమిషనర్ వి.వి.నరసింహారెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. విధుల్లో అలసత్వం వహించడంతో పాటు అనుమతి లేకుండా విధులకు గైర్హాజరై ఫోన్‌లో కూడా అందుబాటులోకి రాకపోవడంతో సస్పెండ్ చేసినట్లు కమిషనర్ తెలిపారు. విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని కమిషనర్ హెచ్చరించారు.

529 మంది గైర్హాజరు

కడప ఎడ్యుకేషన్ : ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల్లో భాగంగా బుధవారం నిర్వహించిన ఇంటర్ ద్వితీయ సంవత్సర ఇంగ్లీష్ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. జిల్లావ్యాప్తంగా 64 పరీక్షా కేంద్రాల్లో జరిగిన పరీక్షలకు 14592 మంది విద్యార్థులకు గాను 14063 మంది హాజరుకాగా 529 మంది గైర్హాజరయ్యారని ఆర్ఐవో తెలిపారు.

నేడు వైవీయూలో క్యాంపస్ డ్రైవ్

కడప ఎడ్యుకేషన్ : యోగి వేమన విశ్వవిద్యాలయ ప్లేస్ మెంట్ సెల్ ఆధ్వర్యంలో గురువారం ఉదయం 10 గంటలకు రిక్రూట్‌మెంట్ డ్రైవ్‌ను నిర్వహిస్తున్నట్లు వైవీయూ ప్రజాసంబంధాల విభాగ సంచాలకులు డాక్టర్ పి.సరిత తెలిపారు. దివీస్ లాబొరేటరీస్ లిమిటెడ్, శ్రీ చైతన్య స్కూల్స్ ప్రతినిధులు క్యాంపస్ ఎంపికలకు రానున్నారని వివరించారు. డిగ్రీ, పీజీ అర్హతలు కలిగిన విద్యార్థులు ఉద్యోగ ఎంపికలకు హాజరు కావాలని సూచించారు. కెమిస్ట్రీ, మైక్రోబయాలజీ, తెలుగు, ఇంగ్లీష్, మ్యాథమెటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బోటనీ, జువాలజీ, కంప్యూటర్స్, సోషల్ స్టడీస్ స్పెషలైజేషన్లను కలిగిన విద్యార్థులు విశ్వవిద్యాలయ నూతన పరిపాలన భవనంలోని ప్లేస్మెంట్ సెల్‌లో హాజరై ప్రయోజనం పొందాలని సూచించారు.

మహిళలు నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలి



మాట్లాడుతున్న ఐసీడీఎస్ పీడీ శ్రీలక్ష్మి

కడప కోటిరెడ్డిసర్కిల్ : సమాజంలో మహిళలు వివిధ అంశాల్లో నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని ఐసీడీఎస్ పీడీ దేవిరెడ్డి శ్రీలక్ష్మి పిలుపునిచ్చారు. బుధవారం నగర శివార్లలోని రిమ్స్ నర్సింగ్ కళాశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా కౌమార బాలికలకు వృత్తి శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నర్సింగ్ వృత్తి చాలా ప్రాముఖ్యమైనదని తెలిపారు. ప్రిన్సిపాల్ హిమగిరి కుమారి మాట్లాడుతూ నర్సింగ్ వృత్తిని స్వీకరించిన వారు సేవాభావంతో పని చేయాలని సూచించారు. కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థినిపై గెస్ట్ ఫ్యాకల్టీ లైంగిక వేధింపులు

వేంపల్లి : ఆర్‌కే వ్యాలీ ట్రిపుల్ ఐటీ విద్యార్థినిపై ఒంగోలు ట్రిపుల్ ఐటీ గెస్ట్ ఫ్యాకల్టీ లైంగిక వేధింపులకు పాల్పడినట్లు ఆర్కే వ్యాలీ ఇన్‌ఛార్జి ఎస్ఐ తిరుపాల్ నాయక్ తెలిపారు. బుధవారం విద్యార్థిని ఫిర్యాదు మేరకు ఇడుపులపాయ ఆర్కే వ్యాలీ పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేశారు. ఎస్ఐ తెలిపిన వివరాల మేరకు... ఆర్కే వ్యాలీ ట్రిపుల్ ఐటీలో ఇంజనీరింగ్ ఫస్ట్ ఇయర్ చదువుతున్న విద్యార్థిని పై ఒంగోలు ట్రిపుల్ ఐటీలో ఫిజిక్స్ గెస్ట్ అధ్యాపకుడిగా పనిచేస్తున్న తిరుపతిరావు లైంగిక వేధింపులకు పాల్పడుతున్నట్లు విద్యార్థిని ఆరోపించింది. మంగళవారం మధ్యాహ్నం విద్యార్థినిని అసభ్యకర పదజాలంతో మాట్లాడటంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. వేధింపులకు పాల్పడిన అధ్యాపకుని ట్రిపుల్ ఐటీ నుంచి వెంటనే తొలగించాలని విద్యార్థిని డిమాండ్ చేసింది. కమిటీని వేసి విచారణ అనంతరం నిర్ణయం తీసుకుంటామని ఉన్నతాధికారులు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

అడ్మిషన్లకు వేళాయెె!

- మోడల్ స్కూళ్లలో 6వ తరగతిలో అడ్మిషన్లకు అవకాశం
- నోటిఫికేషన్ జారీచేసిన విద్యాశాఖ అధికారులు
- ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ ప్రారంభం
- ఉమ్మడి కడప జిల్లాలో 10 మోడల్ స్కూల్స్‌లో అడ్మిషన్లు



ఖాజీపేట మోడల్ స్కూల్

కడప ఎడ్యుకేషన్ : గ్రామీణ ప్రాంతాల్లోని నిరుపేద విద్యార్థులకు సైతం కార్పొరేట్ స్థాయి విద్యనందించాలనే సదాశయంతో మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఏపీ మోడల్ స్కూల్స్ పేరుతో పాఠశాలలను ప్రారంభించారు. సంబంధిత మోడల్ స్కూల్స్‌లో ప్రవేశాలకు రాష్ట్ర ప్రభుత్వం తాజాగా నోటిఫికేషన్ విడుదల చేసింది. 2025–26 విద్యా సంవత్సరానికిగాను ఫిబ్రవరి 24వ తేదీ నుంచి నెట్‌బ్యాంకింగ్/ క్రెడిట్/డెబిట్ కార్డుల ద్వారా ఆన్‌లైన్‌లో ఎగ్జామినేషన్ ఫీజు పేమెంట్స్‌కు అవకాశం కల్పించారు. అలాగే దరఖాస్తులు చేసుకునే ప్రక్రియ గత నెల 25వ తేదీ నుంచి ప్రారంభించారు. ఆన్‌లైన్ పేమెంట్స్‌కు మార్చి 31వ తేదీతో గడువు ముగియనుంది. అర్హత గల విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంది.

ఏప్రిల్ 20న ప్రవేశ పరీక్ష....

ఆరో తరగతిలో ప్రవేశానికి గతేడాది మాదిరిగానే పరీక్ష నిర్వహించనున్నారు. దరఖాస్తు చేసుకున్న మోడల్ స్కూల్‌లోనే ఏప్రిల్ 20వ తేదీన ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్ష జరగనుంది. మెరిట్‌లిస్టు ఆధారంగా రోస్టర్ ప్రకారం సీట్లను కేటాయించనున్నారు. ఏప్రిల్ 27న మెరిట్‌లిస్టు, అదేరోజు సెలక్షన్ లిస్టును సైతం వెల్లడిస్తారు. ఏప్రిల్ 30న సర్టిఫికెట్ల పరిశీలనతోపాటు కౌన్సెలింగ్ ప్రక్రియను చేపట్టనున్నారు. కొత్త విద్యా సంవత్సరం ప్రారంభ తేదీ నుంచి తరగతులు మొదలవ్వనున్నాయి.

పేద విద్యార్థులకు వరం ......

పేద, మధ్య తరగతి కుటుంబాల పిల్లలకు కూడా ఉన్నత చదువులను అందుబాటులోకి తీసుకుని రావడమే ధ్యేయంగా ఏపీ మోడల్ స్కూళ్లు ఏర్పాటయ్యాయి. వెనుకబడిన మండలాలను గుర్తించి ఆయా మండలాల్లో ఈ పాఠశాలలను ప్రారంభించారు. ఈ పాఠశాలల్లో ఆరో తరగతిలో ప్రవేశం పొందితే ఇంటర్ వరకు ఇంగ్లిష్ మీడియం విద్యను అందించడంతోపాటు విద్యా కానుక కిట్లు, ఉచితంగా పాఠ్య పుస్తకాలు, మధ్యాహ్న భోజనం కల్పిస్తున్నారు. తొమ్మిది నుంచి ఇంటర్ వరకు చదివే బాలికలకు కార్పొరేట్ తరహా హాస్టల్ వసతి ఏర్పాటు చేశారు. పూర్తి ఇంగ్లిష్ మీడియంతో సత్ఫలితాలను సాధిస్తున్న మోడల్ స్కూల్/జూనియర్ కాలేజీల్లో అడ్మిషన్ పొందడం అంత ఈజీ కాదు. ప్రైవేటు పాఠశాలల్లో ఎంతో ఖర్చు పెట్టినా అందుబాటులో లేని నాణ్యమైన ఇంగ్లిషు మీడియం విద్య, ఇక్కడ అందుబాటులో ఉండడం పేద పిల్లలకు వరంగా మారింది.

ఉమ్మడి కడపజిల్లాలో పది మోడల్ స్కూళ్లు

ఉమ్మడి కడపజిల్లాలో వల్లూరు, ఖాజీపేట, కాశినాయన, పుల్లంపేట, పెనగలూరు, రామాపురం, లక్కిరెడ్డిపల్లి, రాయచోటి, చిన్నమండెం, సుండుపల్లి మండలాల్లో మొత్తం పది మోడల్ స్కూల్స్ ఉన్నాయి. ఈ పాఠశాలల్లో ఒక్కో పాఠశాలలో 100 సీట్లు చొప్పున మొత్తం 1000 మందిని ఎంపిక చేస్తారు. ప్రవేశ పరీక్ష ప్రశ్నాపత్రం ఆబ్జెక్టివ్ తరహాలో ఉంటుంది. 5వ తరగతి స్థాయిలో ఉండే ఈ పరీక్షను తెలుగు/ఇంగ్లిష్ మీడియంలో రాయవచ్చు. cre.ap.gov.in లేదా apmr.ap.gov.in వెబ్‌పోర్టల్‌లో దరఖాస్తులు చేసుకోవాల్సి ఉంటుంది.

పేద విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి



జిల్లాలోని పేద విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. మోడల్ స్కూల్ అడ్మిషన్ల ప్రక్రియపై క్షేత్రస్థాయిలో అవగాహన కల్పిస్తున్నాం. గ్రామీణ ప్రాంతాల్లోని పిల్లలకు కార్పొరేట్ స్థాయిలో విద్యను అందించాలనే ధ్యేయంతో ఏపీ మోడల్ స్కూళ్లను తీసుకొచ్చారు. ఇంగ్లిష్ మీడియంలో బోధన ఉంటుంది. 6వ తరగతిలో ప్రవేశాలకు ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది.

– షేక్ షంషుద్దీన్, డీఈవో, వైఎస్సార్‌జిల్లా.

యువతకు 'ఉపన్యాస పోటీలు'

నెహ్రూ యువ కేంద్ర జిల్లా యువ అధికారి మణికంఠ

కడప ఎడ్యుకేషన్ : వికసిత్ భారత్ నేషనల్ యూత్ పార్లమెంట్ ఫెస్టివల్ –2025 అనే కార్యక్రమంలో భాగంగా పార్లమెంట్‌లో ప్రసంగించే అవకాశం కోసం ఉపన్యాస పోటీలు నిర్వహిస్తున్నట్లు నెహ్రూ యువ కేంద్ర జిల్లా యువ అధికారి కె.మణికంఠ ఒక ప్రకటనలో తెలిపారు. కడప, అన్నమయ్య జిల్లాలలో 18 –25 ఏళ్లలోపు గల యువత ఈ పోటీలలో పాల్గొనవచ్చని తెలిపారు. వన్ నేషన్ వన్ ఎలక్షన్ అనే అంశం పై ఈ ఉపన్యాస పోటీలు ఉంటాయని చెప్పారు. జిల్లాలో గెలుపొందిన విజేతలకు రాష్ట్ర, దేశ స్థాయిలలో పోటీలు ఉంటాయని చెప్పారు. రాష్ట్ర, దేశ స్థాయిలో గెలిచిన విజేతలకు నగదు బహుమతులు ఉంటాయన్నారు. జిల్లా స్థాయి పోటీలు ఈ నెల 15 వ తేదీన కడపలోని కేఎస్ఆర్ఎం ఇంజనీరింగ్ కళాశాలలో ఫిజికల్ మోడ్‌లో జరుగుతుందని వివరించారు. ఈ ఉపన్యాస పోటీలలో పాల్గొనదలచిన వారు ముందుగా మై భారత్ పోర్టల్ లో రిజిస్టర్ చేసుకొని ఒక నిమిషం వీడియో అప్లోడ్ చేయాలని సూచించారు. పూర్తి వివరాలకు 9177616677 నెంబర్‌తో పాటు కేఎస్ఆర్ఎం కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ లక్షుమయ్యను సంప్రదించాలని ఆయన సూచించారు.

పశువైద్య కళాశాలలో ఉద్రిక్తత



కళాశాల మెయిన్ గేట్ మూసి బైఠాయించిన పశువైద్య విద్యార్థులు



విద్యార్థులతో మాట్లాడుతున్న రూరల్ ఎస్ఐ మహ్మద్ రఫీ, కళాశాల అసోసియేట్ డీన్ శ్రీనివాసప్రసాద్

- కళాశాలలో హాస్టల్ మూసివేత
- బైఠాయించి నిరసన తెలిపిన విద్యార్థులు

ప్రొద్దుటూరు రూరల్ : మండలంలోని గోపవరం సమీపంలో ఉన్న పశువైద్య కళాశాలలో బుధవారం ఉద్రిక్తత చోటు చేసుకుంది. తిరుపతి పశువైద్య విశ్వవిద్యాలయం వీసీ ఉత్తర్వుల మేరకు ఉదయం 7 గంటలకు కళాశాలలోని విద్యార్థుల హాస్టల్‌ను మూసివేశారు. ఉదయం అల్పాహారం హాస్టల్‌లో తయారు చేయకపోవడంతో పశువైద్య విద్యార్థులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కళాశాల ప్రధాన గేట్ వద్ద బైఠాయించి టీచింగ్, నాన్ టీచింగ్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను ఎవరిని లోపలికి వెళ్లకుండా అడ్డుకున్నారు. విషయం తెలుసుకున్న రూరల్ ఎస్ఐ మహ్మద్ రఫీ తన సిబ్బందితో అక్కడికి చేరుకుని విద్యార్థులతో మాట్లాడారు. ఉద్యోగుల విధులకు ఆటంకం కలిగిస్తున్నారని, క్రిమినల్ కేసులు నమోదు చేయాల్సి వస్తుందని విద్యార్థులను ఎస్ఐ హెచ్చరించారు. దీంతో విద్యార్థులు మెయిన్ గేట్‌ను ఓపెన్ చేశారు. అనంతరం కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ సీహెచ్ శ్రీనివాసప్రసాద్‌ను పశువైద్య విద్యార్థులు కలిసి వినతి పత్రం సమర్పించారు. కళాశాల హాస్టల్‌ను తెరవాలని కోరారు. మధ్యాహ్నం ఒంటి గంటకు ప్రొద్దుటూరు నుంచి క్యాటరింగ్ ద్వారా విద్యార్థులంతా భోజనాలు తెప్పించుకుని అక్కడే తిన్నారు. అనంతరం శిబిరంలో కూర్చొని యథావిధిగా సమ్మె చేశారు. తమ ఉద్యమాన్ని అణచివేసేందుకే పశువైద్య కళాశాలల్లో హాస్టల్‌ను మూసివేసి అధికారులు బెదిరిస్తున్నారని వారు ఆరోపించారు.

గండికోటలో రోప్‌వే పనులు ప్రారంభం

- సాక్షి కథనానికి స్పందన
- రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అజయ్‌జైన్ పర్యటన
- రోప్ వే పనుల కోసం అధికారులకు ఆదేశం

కడప కల్చరల్ : ప్రముఖ పర్యాటకప్రాంతం, ఇండియన్ గ్రాండ్ క్యానియన్ గండికోటలో రోప్‌వే పనులకు చలనం లభించింది. 2019లో రోప్ వే పనులు ప్రారంభిస్తున్నామంటూ కొద్దిగా సామగ్రిని సిద్ధం చేసినా పనులు సాగలేదు. ఈ దశలో ఫిబ్రవరి 16న సాక్షి జిల్లా టాబ్లాయిడ్‌లో గండికొడతారా...కోట కడతారా పేరిట ఈ అంశంపై ప్రత్యేక కథనాన్ని ప్రచురించింది. దీంతో గండికోటలో అధికారుల హడావుడి మొదలైంది. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అజయ్‌జైన్ ఇటీవల గండికోటను సందర్శించి రోప్‌వే పనులను వెంటనే ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు.

మళ్లీ హడావుడి

దీంతోపాటు ఆయన గండికోటలో ఓబెరాయ్ ఫైవ్ స్టార్ హోటల్ నిర్మాణానికి అవసరమైన స్థల సేకరణ కోసం ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. వీలైనంత త్వరగా నిర్మాణానికి సంబంధించిన అన్ని పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. శని, ఆదివారాల్లో పర్యాటకులు గండికోటకు ఎక్కువ సంఖ్యలో వస్తుండడంతో వారి వసతికి అక్కడి పర్యాటక హరిత హోటల్ సరిపోవడం లేదు. రోప్‌వే పనులు ప్రారంభమైతే పర్యాటకుల సంఖ్య బాగా పెరిగే అవకాశం ఉంది. కేవలం ప్రారంభాలంటూ ఎప్పటిలా హడావుడి చేయడంతోనే సరిపెట్టకుండా పనులను త్వరగా పూర్తి చేయాలని స్థానిక పర్యాటకాభిమానులు కోరుతున్నారు.

పెద్దదర్గా అభివృద్ధి ఏదీ?

ఇటీవల జరిగిన సమావేశంలో ముఖ్యమంత్రి కడపలోని పెద్దదర్గా, సోమశిలలను అభివృద్ధి చేస్తామని ప్రకటించారు. ఆ తర్వాత దాని అభివృద్ధికి బడ్జెట్‌లో నిధులు కేటాయించకపోవడంపై జిల్లావాసుల్లో ముఖ్యంగా దర్గా అభిమానుల్లో ఒకింత అసంతృప్తి నెలకొంటోంది. ఎకో టూరిజానికి ఎంతో అనువుగా ఉండే సోమశిల పరిస్థితి కూడా అలాగే ఉంది. ఈ ప్రాజెక్టులను వెంటనే పూర్తి చేయాలని పర్యాటకాభిమానులు కోరుతున్నారు.

గుణాత్మక విద్యనందించడమే లక్ష్యం

కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి



మట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి

కడప సెవెన్‌రోడ్స్ : రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు నాణ్యమైన గుణాత్మక విద్య అందించడమే కాకుండా వారి భవిష్యత్తుకు బంగారు బాటలు వేయనుందని కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో జీవో 117 ఉపసంహరణ కోసం రాష్ట్ర ప్రభుత్వం చేపట్టే సన్నాహక మార్గదర్శకాలపై క్షేత్రస్థాయిలో అభిప్రాయ సేకరణ, నివేదికల సమర్పణ తదితర అంశాలపై సంబంధిత విద్యాశాఖ అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జీవో 117ను ఉపసంహరించిన తర్వాత అందుకు ప్రత్యామ్నాయంగా తీసుకొచ్చేందుకు అవసరమైన ప్రక్రియను పాఠశాల విద్యాశాఖ ప్రారంభించిందన్నారు. రెండు నెలల పాటు క్షేత్రస్థాయిలో సంబంధిత శాఖల అధికారులు, పాఠశాలల అభివృద్ధి కమిటీ ప్రతినిధులు, పలువురు మేధావులతో అధ్యయనం జరిగిందన్నారు. కొత్త విధానంలో ఐదు రకాల పాఠశాలలను ప్రతిపాదించారు. జిల్లాలోని ప్రాథమికోన్నత పాఠశాలల స్థానంలో ప్రాథమిక, ఉన్నత పాఠశాలలు నిర్వహణలోకి వస్తాయని.. ప్రాథమిక పాఠశాలల తరగతులు మారుతాయే తప్ప ఆ పాఠశాలలను మూసివేసే ప్రసక్తే ఉండదన్నారు. ఈ అంశాన్ని గుర్తుంచుకొని విద్యార్థుల తల్లిదండ్రులకు పూర్తిస్థాయి వివరణలు ఇవ్వాలన్నారు. పాఠశాల అభివృద్ధి కమిటీలు, మండల సమాఖ్య సభ్యులతో కూలంకుశంగా మాట్లాడితేనే సరైన నిర్ణయాలు బయటకు వస్తాయన్నారు. విలువలతో కూడిన గుణాత్మక విద్యను అందేంచే ఉద్దేశ్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ జీవోను ఉపసంహరించే యోచనలో ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి షంషుద్దీన్, మండల విద్యాశాఖ అధికారులు, మండల ప్రత్యేక అధికారులు పాల్గొన్నారు.

సంతృప్త స్థాయిలో ఆరోగ్య సేవలు అందించండి

గ్రామ,పట్టణ స్థాయిలో వైద్యారోగ్య శాఖలో వైద్యాధికారులు,అనుబంధ శాఖల సిబ్బంది సమన్వయంతో పనిచేస్తూ ప్రజలకు సంతృప్త స్థాయిలో ఆరోగ్య సేవలు అందించాలని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి సూచించారు. బుధవారం కలెక్టరేట్లో ఆరోగ్యశ్రీ, అనుబంధ ఆస్పత్రులు, పట్టణ, గ్రామీణ ఆరోగ్య కేంద్రాల వైద్యులతో ఆరోగ్య సూచికలు, వైద్య శాఖ కార్యక్రమాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి వైద్యాధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ వైద్య వృత్తి ఎంతో గౌరవప్రదమైనదని వైద్యులు ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ వైద్య సేవలు అందించాలన్నారు. వేసవి కాలం దృష్ట్యా అనారోగ్య సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని వైద్య అధికారులకు సూచించారు. మలేరియా, డెంగీ, చికెన్ గున్యా వ్యాధులు విజృంభించకుండా ఉండాలంటే పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలనిదీనిపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఓపీ, ఐపీ,ల్యాబ్ టెస్టు, డెలివరీ వంటి ఆరోగ్య సేవలలో అ గ్రేడ్ సాధించి.. రాష్ట్రస్థాయిలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ర్యాంకింగ్ లో జిల్లా రెండో స్థానంలో నిలిచిందని వెల్లడించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో పర్ఫామెన్స్ ఇండికేటర్స్ లో మంచి ప్రతిభ చూపిన వైద్యాధికారులను జిల్లా కలెక్టర్ అభినందించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా.నాగరాజు, ఆరోగ్యశ్రీ జిల్లా కో ఆర్డినేటర్ బాలంజనేయులు,డీసీహెచ్ఎస్ ఇన్చార్జి కరిముల్ల , కడప డిప్యూటీ డీఎంహెచ్ఓ ఉమా మహేశ్వర రావు, బద్వేల్ డిప్యూటీ డిఎంహెచ్ఓ మల్లేష్, పులివెందుల డిప్యూటీ ఖాజా మొయినుద్దీన్, జమ్మలమడుగు డిప్యూటీ డీఎంహెచ్ఓ శివ ప్రసాద్ రెడ్డి, ప్రోగ్రాం ఆఫీసర్స్, పట్టణ, గ్రామీణ ఆరోగ్య కేంద్రాల వైద్యులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో తాత, మనవడు దుర్మరణం



మృతదేహాలను చూసి రోదిస్తున్న బంధువులు

దువ్వూరు : దువ్వూరు వద్ద ఉన్న కడప – కర్నూలు జాతీయ రహదారిపై బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో తాతా మనవళ్లు దుర్మరణం చెందారు. బంధువుల కథనం మేరకు.. మండలంలోని పెద్దజొన్నవరం గ్రామానికి చెందిన వెంకటసుబ్బయ్య (60), చాపాడు మండలం చీపాడుకు చెందిన నరసింహులు (36) తాత, మనవడు. వీరు దువ్వూరుకు పనిమీద బైక్‌పై బయల్దేరారు. దువ్వూరు సమీపంలోని ఆనకట్ట వద్ద కడప–కర్నూలు జాతీయ రహదారిపై వీరి బైక్‌ను గుర్తు తెలియని వాహనం ఢీకొంది. దీంతో అక్కడికక్కడే ఇరువురు దుర్మరణం చెందారు. ఇద్దరు ఒకే కుటుంబ సభ్యులు కావడంతో బంధువులు కన్నీరుమున్నీరుగా విలపించారు. విషయం తెలుసుకున్న దువ్వూరు ఎస్ఐ వినోద్‌కుమార్ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రొద్దుటూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

'బ్రౌన్' అదనపు భవన నిర్మాణాలను చేపట్టాలి

శాసనసభలో ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి డిమాండ్

కడప కల్చరల్ : కడప నగరంలోని సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రానికి అదనపు భవనాలను వెంటనే నిర్మించేందుకు తగిన చర్యలు చేపట్టాలని శాసనమండలి సభ్యులు ఎంవీ రామచంద్రారెడ్డి బుధవారం రాష్ట్ర శాసనమండలిలో డిమాండ్ చేశారు. ప్రశ్నోత్తరాల సమయంలో ఆయన మండలి స్పీకర్‌కు ఈ విషయాన్ని విన్నవించారు. కడప నగరంలోని బ్రౌన్ గ్రంథాలయం, భాషా పరిశోధన కేంద్రానికి ప్రతిరోజు వందలాది మంది పాఠకులు వస్తుంటారని, ముఖ్యంగా ఉద్యోగార్థులు తమ విజ్ఞానాన్ని పెంచుకునేందుకు, పోటీ పరీక్షలను ఎదుర్కొనేందుకు గ్రంథాలయంలోని పుస్తకాలను పరిశీలిస్తుంటారని తెలిపారు. ఈ గ్రంథాలయం భవనాలను మరింతగా విస్తరించేందుకు అవసరమైన స్థల సేకరణ, భవన నిర్మాణాల కోసం గత ప్రభుత్వం రూ. 6.80 కోట్లు మంజూరు చేసిందని, కానీ ఇంతవరకు నిర్మాణ పనులను సంబంధిత అధికారులు చేపట్టడం లేదని తెలిపారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఇందుకు బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకుని నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించేలా చూడాలని కోరారు.

రిమ్స్ వైద్య విద్యార్థుల ప్రతిభ



జనరల్ మెడిసిన్ విభాగంలో యూనివర్సిటీ టాపర్ గా గెలిచిన డాక్టర్ విరాజితను అభినందిస్తున్న రిమ్స్ అధికారులు

యూనివర్సిటీ టాపర్ గా జనరల్ మెడిసిన్ పీజీ వైద్య విద్యార్థిని డాక్టర్ విరాజిత

కడప అర్బన్ : ఇటీవల జరిగిన యూనివర్సిటీ పీజీ ఫైనల్ పరీక్షలో వివిధ విభాగాలలో రిమ్స్ వైద్య విద్యార్థులు విశేష ప్రతిభ చాటారు. మెడిసిన్‌లో 11 మంది, జనరల్ సర్జరీ ముగ్గురు, గైనకాలజీలో ఐదుగురు, ఆర్థోపెడిక్స్‌లో ముగ్గురు, ఈఎన్‌టీ ముగ్గురు, ఆప్తాలమాలజీ ముగ్గురు, పీడియాట్రిక్స్ ముగ్గురు, అనస్థీషియాలజీలో ఐదుగురు, డెర్మటాలజీలో ఇద్దరు కలిపి మొత్తం 38 మంది విద్యార్థులు ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణత సాధించారు. గైనకాలజీ విభాగంలో డాక్టర్ లావణ్య 76 శాతం మార్కులు సాధించారు. డాక్టర్ విరాజిత జనరల్ మెడిసిన్ విభాగంలో గోల్డ్ మెడల్స్ సాధించడం విశేషం.

జనరల్ మెడిసిన్‌లో గోల్డ్ మెడల్

ఇటీవల జరిగిన పీజీ డిగ్రీ పరీక్షలలో రాష్ట్రస్థాయిలో 609 అత్యధిక మార్కులు సాధించిన డాక్టర్ పందల విరాజిత ఎన్టీఆర్ వైద్య యూనివర్సిటీ టాపర్‌గా నిలిచింది. అడిషనల్ డీఎంఈ రిమ్స్ కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ సురేఖ గోల్డ్ మెడలిస్ట్ పీజీ డాక్టర్ విరాజిత ను పుష్పగుచ్చం ఇచ్చి అభినందించారు. గవర్నమెంట్ మెడికల్ కాలేజీ విద్యార్థులు ఈ స్ఫూర్తితో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. అకాడమిక్ వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ విజయభాస్కర్ రెడ్డి, జనరల్ మెడిసిన్ ఆచార్యులు, విభాగాధిపతి డాక్టర్ కె బి యాదవేంద్ర రెడ్డిగారు, సహాయక ఆచార్యులు కిషోర్ కుమార్ , లీలా ప్రసాద్ బాబు, విజయసింహారెడ్డి అర్జున్ అవ్వారు , మనోహర్ పాల్గొన్నారు.

రైతుల్లో ఐకమత్యంతో ఆర్థికాభివృద్ధి

రైతు ఉత్పత్తిదారుల సమావేశంలో డీఏఓ అయితా నాగేశ్వరావు



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఉద్యానశాఖ అధికారి సుభాషిణి

కడప అగ్రికల్చర్ : రైతులు గ్రూపులుగా ఏర్పడి ఐకమత్యంగా ఉంటే ఆర్థికాభివృద్ధిని సాధించవచ్చని జిల్లా వ్యవసాయ అధికారి అయితా నాగేశ్వర్ రావు పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని వ్యవసాయశాఖ సమావేశ మందిరంలో ఉద్యానశాఖ ఆధ్వర్యంలో రైతు ఉత్పత్తుదారుల సంఘాలకు మౌలిక సదుపాయాలు, మార్కెటింగ్ అనుసంధానాల గురించి అవగాహ సదస్సు జరిగింది. జిల్లా సాంకేతిక ఉద్యానశాఖ అధికారి జ్యోతిర్మయి ఆధ్వర్యంలో జిల్లా ఉద్యానశాఖ అధికారి సుభాషిణి సదస్సుకు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా డీఏఓ అయితా నాగేశ్వరావు మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో కీలక పాత్ర పోషించే రైతు ఉత్పత్తిదారులకు అవసరమైన మౌలిక వసతులు కల్పించడం ద్వారా మరింత శక్తివంతంగా చేయవచ్చన్నారు. లీడ్ బ్యాంకు మేనేజర్ జనార్థన్ రైతు ఉత్పత్తిదారుల సంఘాలు ఎదుర్కొంటున్న బ్యాంకు రుణాల సమస్య గురించి చర్చించారు. నాబార్డు డీడీఎం విజయవిహారి మాట్లాడుతూ రైతులు ఉత్పత్తిదారుల సంఘాల అభివృద్ధికి నాబార్డు అన్ని విధాలుగా సహాయపడుతుందన్నారు. జిల్లా ఉద్యానశాఖ అధికారి సుభాషిణి మాట్లాడుతూ రైతులు సంఘాలుగా ఏర్పడితే ప్రభుత్వం నుంచి వచ్చే పథకాల్లో 75 శాతం రాయితీ పొందవచ్చన్నారు. ఎఫ్‌బీఓను విజయవంతంగా నిర్వహించిన పీలేరు వాసి, జయబ్బనాయుడు తమ అనుభవాలను రైతు ఉత్పత్తిదారులతో పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో రైతులు, రైతు సంఘాల ఉత్పత్తిదారులు పాల్గొన్నారు.